
ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	49,104	49,104
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	5153.78	3936.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

మద్యం దుకాణాలకు భలే భేరం





- అదిరిపోతున్న గుడ్‌విల్ ఆఫర్లు! ● మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారుల ప్రయత్నాలు ● షాపులు రానివారు ఆఫర్లతో ఉక్కిరి బిక్కిరవుతున్న కొత్తలైసెన్స్‌దారులు ● రూ.45లక్షల నుంచి రూ.1.20కోట్ల వరకు ఆఫర్

ఒకరిది అదృష్టం.. మరొకరిది ఆశ. వెరసి రూ.3లక్షల విలువైన దుకాణం రూ.కోటిపైనే ధర పలుకుతుండడం ఆశ్చర్యకరం. టెండర్ల ద్వారా దక్కించుకున్న మద్యం దుకాణాలను సొంతం చేసుకునేందుకు కొంత మంది మద్యం వ్యాపారులు గుడ్‌విల్ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. దీంతో కొత్తగా టెండర్ సొంతం చేసుకున్న వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

కొత్తమద్యం దుకాణాలకు డిమాండ్ పెరిగింది. ఈసారి టెండర్లలో పాత వ్యాపారులకు చాలామందికి దుకాణాలు దక్కకపోవడంతో వ్యాపారం వదులుకోలేక, కొత్తగా దుకాణాలు వచ్చినవారికి గుడ్‌విల్ ఆఫర్‌చేస్తూ దుకాణాలు సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. రెండేళ్లపాటు వ్యాపారంతో పాటు, ఈ కాలపరిమితిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయనే సంకేతాలుండడంతో దుకాణాలకు డిమాండ్ భారీగా పెరిగింది. దశాబ్దాలుగా వ్యాపారంలో ఉన్నవారు దుకాణాలు దక్కకపోవడంతో వ్యాపారం కొనసాగించేందుకు గుడ్‌విల్ ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా జాతరలు జరిగే ప్రాంతాలు, పారిశ్రామిక వాడల సమీపంలోని దుకాణాలు, పెద్ద మండలాల్లోని దుకాణాలకు రూ.కోటికిపైగా గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.కోటి వరకు గుడ్‌విల్ ఆఫర్

నల్లగొండ జిల్లాలో 154 ఏ-4 మద్యం దుకాణాలుండగా, అందులో గౌడ సామాజిక వర్గానికి 34, ఎస్సీ వర్గానికి 14, ఎస్టీలకు నాలుగు దుకాణాలు కేటాయించగా, మిగిలినవి జనరల్ కేటగిరీలో ఉన్నాయి. ఈ దుకాణాల్లో దాదాపు సగానికి పైగా ఈదఫా కొత్తవారికి వచ్చాయని, గతంలో మద్యం వ్యాపారంలో ఉన్నవారికి, సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసిన వారికి చాలామందికి ఈసారి లాటరీల్లో నిరాశ ఎదురవడంతో వ్యాపారం వదులుకోలేక వాళ్లు కొత్తగా దుకాణాలు వచ్చినవారికి గుడ్‌విల్ ఇచ్చి దుకాణాలు పొందేందుకు చర్చలు సాగిస్తున్నారు. మునిసిపల్ కేంద్రాల్లో రూ.45 లక్షల నుంచి మొదలవుతున్న గుడ్‌విల్ గ్రామీణ ప్రాంతాలు, జాతరలు జరిగే ప్రాంతాల్లో ఉన్న దుకాణాలకు రూ.1.20 కోట్లవరకు ఆఫర్ ఇస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. తాజాగా తెలిసిన ప్రకారం నిడమనూరు మండలంలోని ఒక డిమాండ్ ఉన్న గ్రామంలోని మద్యం దుకాణానికి రూ.కోటి వరకు గుడ్‌విల్ ఇవ్వాలని టెండరుదారులు కోరుతుంటే, వ్యాపారులు రూ.90లక్షల వరకు చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మునుగోడు నియోజకవర్గంలోని మండలకేంద్రంలోని ఒక దుకాణానికి ఒక గ్రూపు రూ.90లక్షలు ఆఫర్‌చేయగా, మరో గ్రూపు రూ.కోటి ఇచ్చేందుకు అంగీకరించి వ్యాపారం చేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

మార్చుకుంటున్న దుకాణాలు

మరికొన్ని చోట్ల దుకాణాలు వచ్చినవారు మార్చుకుంటున్నారు. ఇప్పటికే వ్యాపారాల్లో ఉన్నవారికి తాము వ్యాపారం చేసే దుకాణాలు కాకుండా వేర్వేరు చోట్ల దుకాణాలు వస్తే, పరస్పరం మార్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొత్తగా దుకాణాలు దక్కినవారు గుడ్‌విల్‌కు అంగీకరించకపోతే తమ సిండికేట్లలో భాగస్వాములుగా చేసుకుని, వారికొచ్చిన దుకాణంకంటే ఇంకా అదనంగా ఒకటి, రెండు చోట్ల వ్యాపార నిర్వహణలో వాటాలు ఇస్తామని కూడా ఆఫర్ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

డిసెంబరు వరకు సమయమున్నప్పటికీ..

దుకాణాల ఏర్పాటుకు డిసెంబరు మొదటివారం వరకు సమయమున్నప్పటికీ ఈలోగానే ఎలాగైనా ఒకటో, రెండో దుకాణాలు దక్కించుకోవాలని పాత వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గుడ్‌విల్ ఎక్కువగానే ఇస్తుండడంతో లాభాలు తగ్గుతాయని, అంత ప్రయోజనం కూడా ఏమీ ఉండకపోవచ్చని కానీ, వ్యాపారంలో కొనసాగడమే ఏకైక లక్ష్యంగా ఇలా గుడ్‌విల్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లుగా చెబుతున్నారు. బెల్ట్‌షాపులపై నిషేధం అమల్లో ఉన్న మునుగోడు నియోజకవర్గంలోనూ దుకాణాలకు గుడ్‌విల్ భారీగానే ఆఫర్ చేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బెల్ట్ దుకాణాలపై ఆధారపడడం, జాతరలు, ఎన్నికల వంటి భారీ ఈవెంట్లు కొనసాగితే తప్ప ఇంతభారీ గుడ్‌విల్, ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులు పోను, లాభాలు దక్కవనే చర్చ సాగుతోంది.

మార్చిన నిబంధనలతో ఆదాయం పెరిగేనా..?

ఎక్సైజ్ సంవత్సరం-2025-27లో వ్యాపారం నిర్వహించేందుకు ..మిగతా 8వ పేజీలో

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఎస్పీ శరత్ చంద్రపవార్



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ రోజు దేశవ్యాప్తంగా అనేక మంది సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసాలకు గురవుతున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎక్కువగా సులభంగా మోసపోయేది సైబర్ నేరగాళ్ల వల్లేనని అన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డబ్బులు పోయాక బాధపడటం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. విద్యార్థులు తెలుసుకొని వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్ర స్తుతం జరుగుతున్న వివరాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లోని వాట్సాప్‌కు ఏపీకే ఫైల్స్ ఫార్వర్డ్ చేస్తున్నారని, ఈ ఫైల్స్ ఓపెన్ చేస్తే వెంటనే ఫోన్ హ్యాక్ చేస్తున్నారు. వెంటనే ఆ నెంబర్‌కు అనుసంధానమైన బ్యాంకులో డబ్బులు పోయే అవకాశం ఉంటుందని అన్నారు. జంప్డ్ డిపాజిట్ స్కీం, డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, సైబర్ బుల్లింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930కి సమాచారం అందించాలని సూచించారు. వెంటనే పోలీసులు స్పందిస్తారని, తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్బీ సీఐ రాము, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ విష్ణు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు పంపించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేసి ఆ ధాన్యాన్ని తక్షణమే మిల్లర్లకు పంపించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నల్లగొండ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూమెంట్ రిజిస్టర్, ధాన్యం వచ్చిన రిజిస్టర్లను పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం, తేమ శాతంతో పాటి ఇతర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వర్షాలు తగ్గినందున 17శాతం తేమ వచ్చే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులకు సుచించారు. సరైన తేమశాతం, నాణ్యతా ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, ఈ మేరకు అవసరమైన లారీలు, హమాలీలు, కాంటాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. జిచెన్నారం కేంద్ర వద్ద మాట్లాడుతూ సీరియల్ నెంబర్‌తో సంబంధం లేకుండా సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసి ధాన్యం బస్తాలను వర్షానికి తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీల సమస్య, ఇతర ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, డీఏస్వో వెంకటేష్, పౌరసరఫరాల డీఎం గోపికృష్ణ, తహసీల్దార్ పరశురాం ఉన్నారు.

మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

చిట్యాలరూరల్: కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లుల్లో వెంటనే దిగుమతి చేసుకోవాలని, ఆలస్యం చేయవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ధాన్యం దిగుమతి తనిఖీల్లో భాగంగా గురువారం చిట్యాల మండలం వట్టిమర్తిలోని ఓ మిల్లును అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో అశోకొరెడ్డిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యం లోడ్ లారీలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం వివరాలు, దిగుమతుల్లో ఇబ్బందుల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోళ్లు జరగక ఎగుమతులు, దిగుమతులు కాలేదని అన్నారు. ప్రస్తుతం వాతావరణం సాధారణంగా మారినందున కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. మిల్లుల్లో ధాన్యం దిగుమతికి ఏర్పాట్లు చేసుకోవాలని, తాత్సారం చేయవద్దని సూచించారు. కలెక్టర్ వెంట పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డీఎస్‌వో సత్యానాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.విజయ, ఎంపీడీవో ఎస్‌వీ జయలక్ష్మి, డీటీ దీపక్, ఆర్‌ఐలు ఉన్నారు.

ఆరబెట్టిన తర్వాతే..

- వర్షాలు తగ్గడంతో పునఃప్రారంభం ● 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిన ప్రభుత్వ రంగ సంస్థలు



జిల్లాలో ప్రస్తుతానికైతే వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ మొదలైంది. గడిచిన కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలతో పాటు తుఫాన్ ప్రభావం వల్ల కొనుగోలు ఆగిపోయిన విషయం తెలిసిందే. దీంతో తడిసిన ధాన్యంతోపాటు పత్తి తడిసి ముద్దకావడంతో కొనుగోలు చేపట్టలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే అటు పత్తి, ఇటు ధాన్యం ఆరబెట్టిన తర్వాతే విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

వర్షాలు ప్రస్తుతం లేనందున కొనుగోలు చేపట్టడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. అయితే చాలా చోట్ల ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో తడిసిన ధాన్యం రైతులు ఆరబెట్టుకుంటున్నారు. అయితే మళ్లీ అకాల వర్షాలు వస్తే తమ పరిస్థితి ఏమిటన్న భయం రైతులను వెంటాడుతోంది. కొనుగోలు కూడా నత్తనడకన సాగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అకాల వర్షాలు. జిల్లాలో ఇప్పటి వరకు 85 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ఏడాది వానాకాలానికి సంబంధించిన ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వర్షాలు కురుస్తుండడం, ధాన్యం తడిసిపోవడంతో కొనుగోలు జరగడంలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోవడం, అందులో 50 శాతం ధాన్యం తక్కువగా తడవడంతో ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేశాయి. తుఫాన్ ప్రభావంతో 183 ధాన్యం రాశులు తడిసిపోయాయి. ప్రస్తుతం ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో రెండు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని రాశులు పోసి ఉంచారు. చాలాచోట్ల కుప్పలు తడవడంతో రైతులు ఆరబెట్టుకుంటున్నారు. ఇంకా 5లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేయాల్సి ఉంది.

జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు మొదలు

సీసీఐతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తాము పత్తిని కొనుగోలు చేయకుండా సమ్మె చేపడుతామని జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు హెచ్చరించాయి. అయితే ప్రభుత్వం జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో చర్చలు జరపడంతో గురువారంనుంచి పత్తి కొనుగోలు మొదలయ్యాయి. మొత్తం 13 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే చాలా చోట్ల జిన్నింగ్ మిల్లులు సమ్మెకు వెళ్తున్నాయని తెలియడంతో రైతులు పెద్దగా రాలేదని సమాచారం. సమ్మె విరమించిన విషయం రైతులకు తెలియకపోవడంతో స్లాట్ బుకింగ్ చేసుకున్నప్పటికీ పత్తిని తీసుకొని రైతులు రాలేదు. దీనికితోడు చాలాచోట్ల పత్తి తడిసిపోవడంతో పత్తి ఆరిన తర్వాతే వెళ్లాలని రైతులు భావిస్తున్నారు. పత్తి 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని సీసీఐ స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం తేమ శాతాన్ని సడలించకపోవడంతో రైతులు నష్టపోయే అవకాశాలున్నాయి. చాలా చోట్ల పత్తి రంగు మారుతున్నట్లు సమాచారం. వర్షాలతో తడిసిన పత్తి బూజు పట్టడంతోపాటు రంగు మారుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు ఆందోళన గురవుతున్నారు. సీసీఐ రోజుకో నిబంధన పెడుతుండటంతో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతోపాటు రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారుల పరిధిలో లేకపోవడంతో సీసీఐ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వానాకాలంలో నిండా మునిగిన రైతులు

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు నిండా మునిగారు. జూన్, జూలైలో వర్షాలు కురవకపోవడంతో పత్తి సాగు ఆలస్యమైంది. ఆగస్టులో కురిసిన వర్షాలతో జిల్లావ్యాప్తంగా 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగయింది. అయితే దిగుబడి మాత్రం గణనీయంగా ..మిగతా 8వ పేజీలో

విద్యార్థుల రక్షణ విషయంలో రాజీపడొద్దు

- బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యురాలు సరిత
- చెర్వుగట్టులో గురుకుల పాఠశాల సందర్శన



చెర్వుగట్టు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సరిత

నార్కట్‌పల్లి, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల రక్షణ విషయంలో రాజీ పడవద్దని బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యురాలు సరిత అన్నారు. విద్యార్థులు పాఠశాలలో ఉన్నంత వరకు వారి రక్షణ బాధ్యత పాఠశాల యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో ఉన్న గురుకుల పాఠశాలను డీఈవో బిక్షపతి, మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణిలతో కలిసి ఆమె గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యొక్క విద్య నైపుణ్యాలను పరిశీలించి ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. గురుకులంలో అందుతున్న వసతుల కల్పనపై విద్యార్థుల ద్వారా ఆరా తీశారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నర్సింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక కొరతను అధిగమించేందుకు చర్యలు

- నల్లగొండ మైనింగ్ ఏడీ జాకబ్



ఎస్‌లింగోటం వాగులోని ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఏడీ జాకబ్

కనగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మైనింగ్ ఏడీ జాకబ్ అన్నారు. గురువారం మండలంలోని బోయినపల్లి, కనగల్, ఎస్‌లింగోటం గ్రామ వాగుల్లోని ఇసుక రీచ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచాయన్నారు. సాండ్ టాక్సీ కింద బుక్ చేసిన 10 వేల ట్రిప్పుల ఇసుకను వినియోగదారులకు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇసుక రీచ్‌ల్లో వరద ప్రవాహం, మరో పక్క కూలీల కొరత కారణంగా ఇసుక తవ్వకాలు, సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. మరోపక్క దళారులు ఇసుకను బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇసుక సమస్యను అధిగమించేందుకు 15 రోజుల పాటు ఆయా రీచ్‌ల్లో యంత్రాలు (ఎక్స్‌కవేటర్) సాయంతో ఇసుక తవ్వకాలకు తాత్కాలికంగా అనుమతులిచ్చి ఇసుక సరఫరాను వేగవంతం చేసేందుకు కలెక్టర్ పరిశీలిస్తున్నారని అన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద వరద పరిస్థితులను, ట్రాక్టర్ యజమానుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏజీ బాలు, మాజీ సర్పంచ్ పోచమళ్ల లింగయ్యగౌడ్, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు రాజ్యాంగ సవరణ చేసే వరకూ ఉద్యమం

- బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్



జిల్లా కేంద్రంలో మౌన దీక్షలో పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘం నేతలు

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. బీసీ జేఏసీ పిలుపు మేరకు గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో చేపట్టిన మౌనదీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీసీల వాటా బీసీలకే రాజ్యాంగబద్ధంగా దక్కాలని నాలుగు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో విడుదల చేసిందన్నారు. జీవోను వ్యతిరేకిస్తూ కొందరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కోర్టును వేదికగా చేసుకొని అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ పెంచడం ధర్మబద్ధమైనదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అగ్రకులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసినప్పుడు బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఎందుకు ఉండవని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా నవంబరు 6 నుంచి జనవరి చివరి వరకు వివిధ దశల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పోరాటంలో పల్లె నుంచి పట్టణం వరకు బీసీలంతా కదిలి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ నెల 24వ తేదీన ఢిల్లీలో బీసీలకు సామాజిక న్యాయం చేయాలనే ప్రధానమైన డిమాండ్‌తో పార్లమెంట్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, తండు సైదులు గౌడ్, సుంకరి మల్లేష్‌గౌడ్, పంకజ్‌యాదవ్, పిల్లి రామరాజు, చిలకరాజు చెన్నయ్య, చొల్లేటి ప్రభాకర్, పన్నాల గోపాల్, గోలి సైదులు, బకరం శ్రీను, వైద్యుల సత్యనారాయణ, మిర్యాల యాదగిరి, నేలపట్ల సత్యనారాయణ, మల్లయ్య, శంకర్, కాశయ్య, రాములు, వెంకటేశ్వర్లు, జనార్దన్, యాదగిరి, బిక్షం, సీతారాములు, దామోదర్, మదు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం

- ప్రాణాలు తీస్తున్న అధ్వాన రోడ్లు
- టార్పాలిన్లు కప్పని టిప్పర్ల యజమానులు

6

ప్రయాణం.. ప్రాణసంకటం

● ధ్వంసమై గుంతలమయంగా ప్రధాన రహదారులు
● వర్షాలతో నీరు నిలిచి ప్రమాదకరంగా ప్రయాణం
● మంత్రి హెచ్చరికలు పట్టించుకోని టిప్పర్ల యజమానులు

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చే వరకు నమ్మకం లేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదాలకు రహదారులు నిలయాలుగా మారాయి. రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద రోడ్డుపై గుంతను తప్పించబోయి లారీ, టిప్పర్ ఢీకొన్న ఘటనలో 19 మంది మృతి చెందారు. గల్లీ నుంచి ప్రధాన రహదారుల వరకూ గుంతలమయంగా మారిన దారుల్లో ప్రయాణం నిత్యం ప్రాణ సంకటంగా మారింది. వానలు పడినప్పుడు ఈ తిప్పలు రెండింతలు అవుతున్నాయి. ఎక్కడ ఏ స్థాయిలో గుంత ఉందో తెలియక, రహదారులపై నిలిచిన నీటిలోనే బిక్కుబిక్కుమంటూ సాగిపోవాల్సి వస్తోంది.


బాడీ పరిధిని దాటి టార్పాలిన్ కట్టుకోకుండా వెళ్తున్న టిప్పర్

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)
రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద తాండూరు ఆర్టీసీ బస్సు టిప్పర్ వాహనం ఢీకొన్న ఘటన కొందరికి కడుపుకోత, మరికొందరికి గుండెకోత మిగిల్చింది. బస్సులోని 19మంది ప్రయాణికులు మృతి చెందారు. టిప్పర్ విధ్వంసంతో అమాయకుల ప్రాణాలు కంకరకుప్పలో సమాధయ్యాయి. అయితే ఈ ప్రమాదానికి రోడ్డుపై గుంతలో కారణమని ప్రాథమికంగా తేల్చారు. గుంతను తప్పించబోయే క్రమంలోనే అధికవేగం, అధికలోడుతో వెళ్లిన టిప్పర్ వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం అధిక లోడ్‌తో వెళ్లే టిప్పర్‌లపై స్పందించింది. నిబంధనలు పాటించకుండా ఓవర్‌లోడ్‌తో వెళ్లే టిప్పర్‌లపై కేసులు నమోదు చేస్తామని, భారీగా చలాన్లు విధిస్తామని హెచ్చరించింది. ఘటన జరిగిన ఒకటి రెండురోజులు అధికారులు కూడా హడావుడి చేశారు. అయినా టిప్పర్‌ల తీరు మారడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికలోడ్ వేసుకోవద్దని, టిప్పర్ లోడుపై తప్పనిసరిగా టార్పాలిన్ కప్పాల్సిందేనని మంత్రి ప్రభాకర్ ఆదేశించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించే టిప్పర్‌లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కానీ నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లోని క్రషర్ కంపెనీల నుంచి నిత్యం నడిచే టిప్పర్ యజమానులు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. ఎప్పటిలాగే ఇష్టానుసారంగా అధికలోడ్‌తో, టార్పాలిన్‌లు లేకుండా మట్టి, కంకరలను తరలిస్తున్నారు. టిప్పర్ బాడీ కన్నా ఎక్కువ ఎత్తులో కంకరను లోడ్ చేసుకుని టార్పాలిన్ లేకుండా ప్రయాణిస్తున్నాయి.



(ఫైల్)

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



రోడ్డు భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్‌గా నడిపే వాహనాలపై కేసులు నమోదు చేస్తాం. కంకర ఇతర లోడును బాడీ లెవెల్‌లో మాత్రమే రవాణా చేయాలి. దాంతో పాటు రోడ్లపై ప్రయాణించే ఇతర వాహనాలు, పాదచారులకు ఇబ్బంది కలగకుండా టార్పాలిన్ కట్టుకోవాలి. ఓవర్ లోడ్, ఓవర్ స్పీడ్‌తో వెళ్తే సదరు వాహనాలపై చర్యలు తప్పవు.

దగ్గుల క్రాంతికుమార్, ఎస్ఐ, నార్కట్‌పల్లి

ముగ్గురిని మింగిన కల్వర్టు.. అప్పాలి అలర్ట్



నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బాజకుంట గ్రామం వద్ద నార్కట్‌పల్లి-అమ్మనబోలు ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. అడుగుల మేర విచ్చుకుని గుంతలు ఏర్పడ్డాయి. భారీవర్షాల సమయంలో కల్వర్టుపై నుంచి వరద ప్రవహిస్తుంటుంది. ఆ సమయంలో ఏమాత్రం వాహనం అదుపుతప్పినా ప్రమాదం చోటుచేసుకున్నట్టే. అక్టోబరులో ఇదే ప్రదేశం వద్ద ముగ్గురు స్కూటరిస్టులు చనిపోగా, మరికొందరు గాయపడ్డట్లు స్థానికులు తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

హద్దు దాటితే.. అంతే



(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ రూరల్)
కోదాడ-జడ్చర్ల రహదారిపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామం వద్ద బంధంపై ఏర్పాటుచేసిన బ్రిడ్జి రెయిలింగ్ దెబ్బతింది. ప్రమాదాలకు నెలవుగా కనిపిస్తున్నా ఏడాది నుంచి మరుమ్మతులు చేపట్టలేదు. నిత్యం ఇదే దారిలో వెళ్లే అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని, వెంటనే పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



తుంగపాడు బంధంపై వంతెనపై రెయిలింగ్ దెబ్బతిన్న ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టిం చుకోవడంలేదు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా వంతెన మరమ్మతు పనులు చేపట్టాలి. సామ రవి (తుంగపాడు)

అటూ ఇటూ ప్రయాణం



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణం నుంచి వలిగొండకు వెళ్లే రహదారిపై గుంతలు రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. వర్షాలతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. హైదరాబాద్-విజయవాడ హైవే నుంచి 100 మీటర్ల వరకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఏ దారిన వారు వెళ్లే అవకాశం లేకపోవడంతో అటూ ఇటూ వెళ్తూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. పాదాచారులు కూడా నరకయాతన అనుభవిస్తున్నారు. గుంతలను పూడ్చి వేసి రాకపోకలకు మార్గమం సుగుమం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్ కోరారు.

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

కాలు కదపాలంటే



నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. వర్షాల సమయంలో గుంతల్లో నీరు నిలిచి బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. 18వ వార్డు, బొడ్రాయిబజార్, పాత పోలీస్‌స్టేషన్, ముత్యాలమ్మ బజార్‌కు వెళ్లే రోడ్డు, మార్కెట్‌రోడ్డు, గ్రామీణ బ్యాంక్‌కు వెళ్లేదారులు ప్రమాదకరంగా మారాయని స్థానికులు తెలిపారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

. (ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

బీఎస్‌ఆర్ కాలనీలో గుంతలమయమై రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

దెబ్బతిన్న డివైడర్



యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రం భువనగిరి పట్టణ ప్రధానరహదారిపై ఉన్న డివైడర్ పలుచోట్ల వాహనాలు ఢీకొని ధ్వంసమైంది. సుమారు రెండున్నర కిలోమీటర్లు ఉన్న డివైడర్‌కు సంబంధించి యూటర్న్, రోడ్డు దాటేందుకు అనువుగా ఉన్న పలుప్రాంతాల్లో వాహనాలు ఢీకొని రాళ్లు తేలడం, కొన్నిరాళ్లు రోడ్డుపైకి జారిపడ్డాయి. ధ్వంసమైన చోట మునిసిపాలిటీ మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

సాగర్‌లో బేకరీ సీజ్


బేకరీ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నాగార్జునసాగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నందికొండ పట్టణంలోని నాణ్యతా ప్రమాణాలు పాటించని మణికంఠ బేకరీ దుకాణాన్ని జిల్లా ఆహార భద్రతా అధికారులు సీజ్ చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు గురువారం తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. బేకరీ నిర్వహిస్తున్న యజమాని ఇంట్లో తనిఖీ చేయగా తినుబండారాల తయారీలో కాలపరిమితి దాటిన ముడి పదార్థాలను వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఫంగస్ పట్టిన పదార్థాలు, కుళ్లిపోయిన కోడిగుడ్లు, హానికారక రంగులను వినియోగిస్తున్నారని, ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని ఆయన తెలిపారు. పక్కనే గురుకుల పాఠశాల ఉండటంతో వీటిని విక్రయిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, ఈ విషయంలో జాగ్రత్త పడాలని విద్యార్థులకు ఆయన సూచించారు. నిబంధనలు పాటించని బేకరీకి నోటీసులు జారీ చేసి నెల రోజులు సీజ్ చేస్తున్నట్లు శివశంకర్‌రెడ్డి తెలిపారు.

శతవసంత వేడుక

● 102 ఏళ్ల వృద్ధుడికి గ్రామాభివృద్ధి కమిటీ సన్మానం

వందేళ్లు పూర్తి చేసుకున్న ఓ వృద్ధుడిని గ్రామాభివృద్ధి కమిటీ సన్మానించింది. ఆయన జన్మదినాన్ని వేడుకగా జరిపించారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ఓడపల్లి సోమయ్యకు 102 ఏళ్లు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. మనమళ్లు, మనమరాళ్లు కలిపి 25 మంది. నాలుగు తరాలను చూసిన సోమయ్యను, ఆయన సతీమణి రామక్కతో గురువారం కేక్ కట్ చేయించి, శాలువాతో కమిటీ సన్మానించింది. వందేళ్లు జీవించిన వ్యక్తి గ్రామంలో ఉండటం, వారి అనుభవాలు గ్రామాభివృద్ధికి తోడ్పడతాయని కమిటీ బాధ్యులు గొడుగు రమేష్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఏసీ రెడ్డి, లక్ష్మణ్, వెంకన్న, నరేష్, కృష్ణయ్య, జే మహేష్, ఉప్పలయ్య, యాదగిరి, రవీందర్, రామకృష్ణ, భాస్కర్, బాలరాజు, లక్ష్మయ్య, సోమనర్సయ్య, భిక్షం, మల్లేష్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి రూరల్)


తొండ గ్రామంలో శతాధిక వృద్ధుడు సోమయ్య, సతీమణి రామక్కలను సన్మానిస్తున్న అభ్యుదయ కమిటీ సభ్యులు

కమిషనర్ ఛాంబర్‌లో ఫర్నీచర్ ధ్వంసం

● గుట్ట మునిసిపాలిటీలో దుండగుల దాడి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మునిసిపాలిటీలో గుర్తుతెలియని దుండగులు దాడి చేసి ఫర్నీచర్, కంప్యూటర్‌లను ధ్వంసం చేశారు. కమిషనర్ మిర్యాల లింగస్వామి గురువారం తెలిపిన వివరాల ప్రకారం బుధవారం కార్తీకపౌర్ణమి సెలవు అయినప్పటికీ రోజూ మాదిరే కొంతమంది సిబ్బంది తమ పెండింగ్ పనులు పూర్తి చేసుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. పండగ నేపథ్యంలో వాచ్‌మన్ రాత్రి ఇంటికి వెళ్లి మధ్య రాత్రి కార్యాలయానికి వచ్చాడు. అప్పటికే గుర్తుతెలియని దుండగులు కార్యాలయ తాళాలు పగులగొట్టి కమిషనర్ ఛాంబర్‌లోని ఫర్నీచర్, కంప్యూటర్లను, కార్యాలయంలో 13 గదుల తాళాలు పగులగొట్టి అకౌంటెంట్ బీరువా తాళం పగులగొట్టి పలు ఫైళ్లను ధ్వంసం చేసినట్లు గుర్తించాడు. వెంటనే తమకు సమాచారం ఇవ్వడంతో సీఐ భాస్కర్‌కు తెలియజేసినట్లు కమిషనర్ లింగస్వామి తెలిపారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీం, సీఐ భాస్కర్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఆయనతో పాటు శానిటరీ ఎస్ఐ సురేందర్‌గౌడ్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ దండు కిరణ్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


దుండగుల దాడిలో ధ్వంసమైన ఫర్నీచర్, కంప్యూటర్లు

విద్యుదాఘాతంతో పశువుల కాపరి, గేదె మృతి


మల్లయ్య(ఫైల్)

రామన్నపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పశువుల కాపరి, గేదె మృతి చెందాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ఈ నెల 5న జరిగింది. తుమ్మలగూడెం గ్రామానికి చెందిన గేదెల కాపరి గొర్ల మల్లయ్య(70) రోజు మాదిరిగానే గేదెలను మేపడానికి వెళ్లాడు. సాయంత్రం ఓ గేదె పొలం వైపు వెళ్లడంతో మళ్లించేందుకు వెళుతూ బురదలో ఉన్న సర్వీసు తీగకు తగిలాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై మల్లయ్యతో పాటు గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి మల్లయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతికారు. గురువారం ఉదయం బావుల వద్దకు రైతులు మల్లయ్యను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

చిట్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. గాంధీ ఆసుపత్రి చికిత్సపొందుతున్న అక్కను చూసేందుకు సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పంతం సువర్ణరాజు(19) మంగళవారం రాత్రి 10గంటల ప్రాంతంలో సూర్యాపేట నుంచి ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరాడు. చిట్యాల శివారులో అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. సువర్ణరాజు తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన ఆర్టీసీ బస్సు

ఆత్మకూరు(ఎం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లాలో ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి మూలమలుపు వద్ద గురువారం ఇసుక లారీ తగలడంతో ఆర్టీసీ బస్సు పాక్షికంగా దెబ్బతింది. ఆర్టీసీ డ్రైవర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం తొర్రూర్ డిపోకు చెందిన డీలక్స్ బస్సు మోత్కూరు నుంచి ఉప్పల్‌కు వెళ్తోంది. రాయగిరి నుంచి మోత్కూరు వైపునకు వస్తున్న ఇసుక లారీ ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి మూలమలుపు వద్దకు రాగానే అతివేగంతో ఆర్టీసీ బస్సును తాకుతూ వెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు గట్టిగా కేకలు వేయడంతో బస్సును నిలిపారు. బస్సు కుడివైపు పాక్షికంగా దెబ్బతింది. అప్పటికే లారీ వెళ్లిపోవడంతో డ్రైవరు డయల్-100కు ఫోన్ చేసి విషయం చేరవేశాడు. కప్రాయపల్లి వద్ద పోలీసులు లారీ ని పట్టుకొని పోలీస్టేషన్ తరలించారు. బస్సులో ఉన్న 24 మంది ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఇతర బస్సులలో వారిని గమ్యస్థానానికి తరలించారు. బస్సుకు జరిగిన నష్టాన్ని భరిస్తానని లారీఓనర్ అంగీకరించడంతో సమస్య సద్దుమణిగింది.

ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్

చౌటుప్పల్ రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జిల్లా రవాణాశాఖ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఫిట్‌నెస్ సెంటర్ వద్ద పలు వాహనాలను నిలిపి తనిఖీచేశారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు మాట్లాడుతూ వికారాబాద్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిట్‌నెస్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పేరుకే విలేకరి..చేసేది దొంగతనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు, ఎస్ఐ రాంమూర్తి

చింతపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నట్లు కనిపిస్తూనే చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి మండలకేంద్రానికి చెందిన షేక్ అలీ ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్నాడు. 2019లో చింతపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెండు కంప్యూటర్లతో పాటు ఎల్ఈడీ స్ర్కీన్‌ను చోరీ చేశాడు. తహసీల్దార్ సునంద ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం, ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా చోరీలకు పాల్పడిన వ్యక్తి విలేకరిగా పనిచేస్తున్న అలీగా గుర్తించారు. మర్రిగూడ మండలం శివన్నగూడకు చెందిన గ్యార రమణతో కలిసి చోరీలకు పాల్పడేవాడని, రంగారెడ్డి జిల్లా యాచారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు సీఐ, ఎస్ఐలు తెలిపారు. అదేవిధంగా వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసుతో పాటు రాత్రివేళ కారు బ్యాటరీలు చోరీ చేస్తూ విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడని తెలిపారు. నిందితుడి నుంచి మానిటర్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

సూర్యాపేటక్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్, ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ ఏ వెంకటయ్య తెలిపారు. గురువారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని భాషానాయక్ తండాకు చెందిన ప్రస్తుతం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో నివసిస్తున్న గడ్డం లక్ష్మణ్‌కుమార్ కొంతకాలంగా మాయమాటలతో మోసం చేస్తున్నాడు. సూర్యాపేట, తిరుమలగిరి, హైదరాబాద్, నెల్లూరు ప్రాంతాల్లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయక ప్రజలను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు తీసుకుని మోసగిస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట పట్టణంలో ఒక మహిళను కూడా ఉద్యోగాల పేరుతో నమ్మించి వారి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసగించాడని సీఐ తెలిపారు. ఇలా సుమారు రూ.3 కోట్ల వరకు వసూలు చేశాడని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు లక్ష్మణ్‌కుమార్‌ను గురువారం పట్టణ ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో కలిసి తిరుమలగిరి పట్టణంలో ఉండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ శివతేజ, సిబ్బంది శ్రీరాములు ఉన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

తుర్కపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపారు. గోపాల్‌పూర్ గ్రామంలో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి బక్కల కనకయ్య, బక్కల రమేశ్, మందరి నవీన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి రూ.2,040లు నగదు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక పేకముక్కల సెట్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవో విచారణ


విచారణ జరుపుతున్న ఎంపీడీవో

కొండమల్లేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయడం లేదన్న ఫిర్యాదులపై నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని దేవరోనితండాలో అధికారులు విచారణ చేపట్టారు. తపాలా సిబ్బంది జహంగీర్ రెండు, మూడు నెలలకు ఒకసారి పింఛన్లు చెల్లిస్తున్నాడని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి గురువారం గ్రామస్థుడు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టాలని ఎంపీడీవో స్వర్ణలతను కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవోతో పాటు ముగ్గురు కార్యదర్శులు కలిసి తండా వాసుల నుంచి వివరాలు సేకరించారు. సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయడం లబ్ధిదారులు తెలపడంతో జహంగీర్‌ను గ్రామానికి పిలిపించి విచారించారు. అయితే ప్రతి నెలా సక్రమంగా చెల్లిస్తున్నట్లు జహంగీర్ తెలిపారు. ఈ క్రమంలో తండాకు చెందిన రాజు, జహంగీర్‌ల మధ్య వాగ్వాదం పెరగడంతో జహంగీర్‌పై రాజు చేయిచేసుకున్నాడు. తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ల ఉదంతంపై నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విచారణలో పంచాయతీ కార్యదర్శులు డాకునాయక్, సరస్వతి, కిరణ్ తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బొమ్మలరామారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలానికి చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామస్థులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పలుకు రమేష్(48) గ్రామానికి పక్కనే ఉన్న మేడ్చల్ జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి గేదెలు మేపేందుకు కూలీ పనినిమిత్తం వెళ్లాడు. ఉదయం వెళ్లిన రమేష్ సాయంత్రమైనా రాకపోవడంతో కుమారుడు అంకిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధి ప్రాంతంలో వెతికాడు. అనుమానాస్పద స్థితిలో పడిఉండడం గమనించి గ్రామస్థులకు, మేడ్చల్ జిల్లా కీసర మండలం పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలంలో రమేష్ పర్సు, డబ్బులు వేర్వేరు ప్రదేశాల్లో పడి ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీంను రప్పించాలని సంఘటనా స్థలంలో ఆందోళన చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

జాతీయ మల్లకంబ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు

చౌటుప్పల్ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ విద్యాసంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మల్లకంబ్(పోల్‌పై యోగా) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రజట్టుకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24, 25వ తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణంలో ఈ నెల 4, 5వ తేదీల్లో మల్లఖంబ్ రాష్ట్రజట్టు ఎంపిక పోటీలు నిర్వహిం చారు. 17 సంవత్సరాల బాలుర విభాగంలో శ్రీహర్ష, 14 సంవత్సరాల బాలుర విభాగంలో బి. చరణ్ సాయి, విఘ్నేష్ ఎంపికయ్యారు. మరో ఐదుగురు విద్యార్థులు స్టాండ్‌బైగా ఎంపికయ్యారు. విద్యార్థులను ట్రినిటీ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మంజుల, చైర్మన్ కృష్ణారావు తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తిప్పర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని మామిడాల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా సెలక్షన్‌లో 14 సంవత్సరాల బాలికల విభాగంలో జెర్రిపోతుల కీర్తి, బాలుర విభాగంలో బుచ్చాల రామ్‌చరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కొమరాజు యాదగిరి తెలిపారు. నారాయణపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ బెడుదూరి సురేందర్‌రెడ్డిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విష్ణు, శ్రీనివాస్, ఖైరొద్దీన్, సైదయ్య, జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 విభాగంలో..



కట్టంగూరు: నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెర్వు అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని చిలుముల శివాని అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 4న చెర్వుఅన్నారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఆ పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతమల్ల పుల్లయ్య తెలిపారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు కోస్గిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థినిని హెచ్‌ఎం వ్యాయామ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రాంమోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగం, నరహరి, లింగయ్య, సంపత్‌కుమార్, మంగ అభినందించారు.

రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో తృతీయ బహుమతి



సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కట్టంగూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీజీఐఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ కాంపిటీషన్-2025 పోటీలు గురువారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. డ్యాన్స్ విభాగంలో నల్లగొండ జిల్లా కట్టంగూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం 10వ తరగతి విద్యార్థులు లక్ష్మీప్రసన్న, నిమిష, ప్రియాంక, వైష్ణవి రాష్ట్రస్థాయి తృతీయ బహుమతికి ఎంపికయ్యారు. విద్యార్థులకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్, అడిషనల్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. రాధారెడ్డి నగదు రూ.2వేల నగదుతో పాటు ప్రశంశా పత్రాలు అందజేశారు. విద్యార్థులను పాఠశాల ఎస్‌వో నీలాంబరి, ఉపాధ్యాయులు అభినందించారు.

జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

రాజాపేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలకేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీసీవోలు శ్రీనివాసరావు, సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాపోటీలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగాలన్నారు. కార్యక్రమంలో క్రీడల సమన్వయ కర్త శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వేణుప్రసాద్, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దొరక్క..



నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత ఏర్పడింది. ఆగామోత్కూర్, బీమనపల్లి, కల్వలపాలెం, చిరుమర్తి, పాలేరు వాగుపై ఉన్న చెక్‌డ్యామ్‌లు అలుగుపోయడంతో ఇసుక దొరకకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆగామోత్కూర్ వాగులో నుంచి ఇసుకను వాగుఒడ్డుకు వేసి ఎడ్లబండి సాయంతో ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో ఎడ్ల బండికి దూరాన్ని బట్టి అదే గ్రామంలో అయితే రూ.500, పక్క గ్రామాలకు తరలిస్తే రూ. 1,100 నుంచి రూ.1,500 వరకు తీసుకుంటున్నారు.

● ఆంధ్రజ్యోతి -మాడ్గులపల్లి

లిఫ్ట్ పనులు నీటి మూటలే

● నత్తనడకన తోపుచర్ల లిఫ్టు పనులు ● పూర్తయితే 316 ఎకరాలకు నీరు ● మరో 500 ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం



కొనసాగుతున్న తోపుచర్ల పంప్‌హౌస్ పనులు

మాడ్గులపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు పెంపొందించాలనే లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడంలేదు. లిఫ్ట్ పనులు పూర్తిచేసి చెరువులు నింపుతామని ఎన్నికల సమయంలో గ్రామాల్లోకి వచ్చి నాయకులు ప్రచారం చేసిన మాటలు నీటి మూటలుగా మిగులుతున్నాయి. రూ.10కోట్లతో తోపుచర్ల లిఫ్టు పనులు చేపడతామని గత ప్రభుత్వం ప్రకటించినా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. లిఫ్టు పనులు పూర్తయితే మేలు జరుగుతుందనుకున్నా పనులు నత్తనడకగా కొనసాగడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఎల్-14 స్టేజ్ 1-పంప్‌హౌస్ నుంచి తోపుచర్ల, పుచ్చకాయలగూడెం, సీత్యాతండా, దేవతల బావిగూడెం, గణపతివారిగూడెం, బొమ్మకల్ గ్రామాల గొలుసు కట్టు చెరువులు నింపేందుకు లిఫ్టు మంజూరైంది. భూములు సర్వే చేసి వేములపల్లి మండల పరిధిలోని ఎల్-14 స్టేజ్-1 పంప్‌హౌస్ నుంచి తోపుచర్ల, పుచ్చకాయలగూడెం వరకు 5.6 కిలో మీటర్ల మేర భూగర్భ పైపులైన్ వేసి చివరి చెరువులకు నీటిని నింపేందుకు వీలుగా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు. తోపుచర్ల గ్రామంలోని పెద్ద చెరువు, చిన్న చెరువు, సీత్యాతండా చెరువు, గణపతివారి గూడెం చెరువు, దేవతల బావిగూడెం చెరువు, బొమ్మకల్ చెరువులోకి నీటిని నింపడం ద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీరతాయని అను కున్న రైతులకు నిరాశే మిగిలింది. ఇప్పటివరకు లిఫ్టు పనులు పూర్తికాక వ్యవసాయ ఆధారమైన పత్తి, వరిపంటను సేద్యం చేస్తున్నారు. ఆరు చెరువులను నింపడం ద్వారా 316 ఎకరాలకు నీరందే అవకాశమున్నా అనుకున్న స్థాయిలో పనులు జరగకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. లిఫ్టు పనులు పూర్తయి చెరువులోకి నీరు చేరి భూగర్భజలాలు వృద్ధి చెందడంతోపాటు బోరుబావుల కింద సుమారు మరో 500ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశముందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిరెండు సంవత్సరాలు అయినా లిఫ్టు పనుల్లో పంప్‌హౌస్ పనులు మాత్రమే పూర్తయిందని అధికారులు పేర్కొన్నారు.

పైపులైన్ పనులు త్వరలో చేపడతాం

మాడ్గులపల్లి తోపుచర్ల లిఫ్టు పంప్‌హౌస్ పనులు నడుస్తున్నాయి. ఎక్కువ మంది రైతులు వరి పొలాలు వేయడంతో పైపులైన్ పనులకు ఆటంకం ఏర్పడుతుంది. వేసవి వరి కోతల తర్వాత పైపులైన్ పనులను ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

వి. శివకుమార్, ఎన్ఎస్‌పీ డీఈఈ.

పైపులైన్‌కు అడ్డంకిగా..



ఎల్-14 సెకండ్ స్టేజ్ పంప్‌హౌస్

ఎల్-14 స్టేజ్1 పంప్‌హౌస్ నుంచి పుచ్చకాయలగూడెం వరకు 5.6 కిలో మీటర్ల పైపులైన్ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. గత ప్రభుత్వంలో లిఫ్టు పనులను పూర్తిచేసినా ఇప్పటివరకు పైపులైన్ పనులకు మోక్షం కలగలేదు. పంప్‌హౌస్ నుంచి పుచ్చకాయలగూడెం వరకు 5.6 కిలో మీటర్ల మేరా ఉన్న పైపులైన్‌కు వ్యవసాయ భూములు అడ్డంకిగా మారింది. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో 5 కిలో మీటర్ల మేరా ఉన్న భూముల్లో రైతులు వరి పంటలను సాగు చేశారు. కోతలు కోసినా మళ్లీ వేసవి పంటకు రైతులు నార్లు పోసుకొని వ్యవసాయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పైపులైన్ ఏర్పాటు ప్రక్రియ ఈ సీజన్‌లో జరిగే అవకాశం లేదు. రైతులతో మాట్లాడి పైపులైన్ పనులను చేపడితే పైపులైన్ ఏర్పాటు పూర్తవుతుందని లేకపోతే ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.

తోపుచర్ల లిఫ్టు పనులు పూర్తిచేయాలి



తోపుచర్ల లిఫ్టు పనులు త్వరగా పూర్తిచేయాలి. నీటి కోసం ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువుల్లోకి నీరు రావడంతో వ్యవసాయం చేసుకోగలుగుతున్నాం. లిఫ్టు పనులు ప్రారంభించి రెండేళ్లవుతున్నా ఇప్పటివరకు అధికారులు పూర్తి చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లిఫ్టు పనులను పూర్తిచేసి చెరువులను నింపాలి.

మారుతి వెంకట్‌రెడ్డి, రైతు, బొమ్మకల్

కాల్వ వెంట మట్టి మాయం

● అనుమతి లేకుండా ఏఎమ్మార్పీ కాల్వ వెంట మట్టి తరలింపు ● పట్టించుకోని అధికారులు



ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ వెంట చామలోనిబావి వద్ద మట్టి దిబ్బలు తరలింపుతో ఏర్పడిన గుంతలు



గుర్రంపోడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వెంట మట్టి దిబ్బలు మాయమవుతున్నాయి. ఏళ్ల తరబడి ఈ తంతు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా పడుతోంది. నిబంధనల ప్రకారం మట్టికోసం మైనింగ్‌శాఖకు దరఖాస్తు చేసుకుంటే ఆ శాఖ నుంచి నీటిపారుదలశాఖ ద్వారా మట్టి లభ్యతను గుర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వ అవసరాలకైనా కాంట్రాక్టర్ అనుమతి పొందాల్సిందే. ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వంద కిలోమీటర్ల పొడవున ఏళ్ల తరబడి ఇవేమిలేకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మట్టి తరలిస్తున్నారు. ప్రధాన కాల్వ తవ్వకంతో అప్పట్లో డీప్‌కట్ జరిగిన చోట 20మీటర్ల ఎత్తువరకు మట్టిదిబ్బలు కూడా అక్కడక్కడ ఉన్నాయి. 20ఏళ్లుగా మట్టి తరలిస్తుండడంతో చాలా వరకు మట్టి దిబ్బలు మాయమవుతున్నాయి. జేసీబీ, టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇటీవల కాలంలో ఒకరు మాత్రమే అనుమతి తీసుకున్నారని ఏఎమ్మార్పీ గుర్రంపోడు డివిజన్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రధాన కాల్వ వెంట ముందుగా మట్టి తరలించి ఆ తర్వాత అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో ప్రధాన కాల్వ వెంట దారి మినహా మట్టి పోసేందుకు అప్పట్లో ప్రభుత్వం భూ సేకరణ జరిపిన భూమి రికార్డులకు మాత్రమే పరిమితమైంది. ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో వంద కిలోమీటర్ల ప్రధాన కాల్వలో గుర్రంపోడు డివిజన్ పరిధిలోని ప్రధాన కాల్వ 37వ కిలోమీటర్ నుంచి 82కిలోమీటర్ వరకు 45కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వ ఇక్కడే అధికంగా ఉంది. డివిజన్ పరిధిలో 2500 ఎకరాల మేరకు భూసేకరణ జరగగా ప్రధాన కాల్వ మేజర్ కాల్వల వెంట సుమారు 300ఎకరాల వరకు ఆక్రమణలో ఉందని తెలుస్తోంది.

వాహనాలు సీజ్ చేస్తాం

ఏఎమ్మార్పీ కాల్వల వెంట రాత్రి వేళలో మట్టి టిప్పర్‌లు, ఎక్స్‌కవేటర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం ఉంది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ నిఘా ఉంచి అనుమతులులేకుండా తరలిస్తే ఆ వాహనాలు సీజ్ చేస్తాం. మట్టి తొలగించి తాత్కాలికంగా భూమిని తమ భూమిలో పక్క రైతులు కలిపేసుకొని ఆక్రమించుకున్న ఆ భూమిపై వారికి హక్కులు ఉండవు. భూభారతి ద్వారా లెక్కలు తీసి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుంది.

● శ్రీనివాసరావు, ఏఈ

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

● సాగర్‌లో బీసీ గురుకులాల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



విద్యార్థుల ప్రదర్శన

నాగార్జునసాగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని సైబర్ సీఐ, సాగర్ బీసీ గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి శ్రవణ్‌కుమార్ అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో నిర్వహించే బీసీ గురుకులాల స్పోర్ట్స్‌మీట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలని కోరారు. తాను కూడా 2001 లో సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో పదోతరగతి చదివానని, ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహిస్తున్నాని తెలిపాడు. తాను చదువుకన్న పాఠశాలకే తాను ముఖ్యఅతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యుడు శివాజీ రాజ్, నాట్కో ఫార్మా అధికారి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ రవికుమార్, ఏటీపీ సంతోష్, పీడీలు జ్యోతి, అరుణ, పీఈటీలు నర్సింహ, జానకీరామ్, వార్డెన్ అజయ్‌చంద్ర, ఉపాధ్యాయులు, 16 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రతినిధులు

మొదటి రోజు విజేతలు వీరే..

లాంగ్ జంప్‌లో మూసీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి భరత్‌చంద్ర (ప్రథమ), షార్ట్‌పుట్‌లో అనంతారం గురుకుల విద్యార్థి అరవింద్ (ప్రథమ) స్థానం, 100మీటర్ల పరుగు పందెంలో నాగార్జునసాగర్ విద్యార్థి గణేష్ (ప్రథమ), ఖోఖో పోటీల్లో నాగార్జునసాగర్ పాఠశాల (ప్రథమ) స్థానంలో నిలిచింది. వాలీబాల్‌లో సాగర్ బీసీ గురుకుల పాఠశాల జట్టు గెలుపొందగా, కబడ్డీ పోటీల్లో అనంతారం జట్టు విజేతలుగా నిలిచాయి.



స్వర్ణగిరి ఆలయంలో కార్తీక దీపోత్సవం



ఆలయంలోని విష్ణుమూర్తి శేషతల్పం

స్వర్ణగిరిలో ఆధ్యాత్మిక శోభ

భువనగిరి టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ఆధ్యాత్మిక క్షేత్రం స్వర్ణగిరిలో గురువారం నిర్వహించిన సంప్రదాయ పూజలతో భక్తజనం పులకించింది. సుప్రభాత సేవ, నిత్యారాధన, సువర్ణ బిందె తీర్థ అభిషేకం నిర్వహించారు. నిత్య కల్యాణోత్సవం, నైవేద్యం సమర్పణ, కర్పూర మంగళహారతులతో తిరుసేవ నిర్వహించారు. కార్తీక దీపోత్సవంతో ఆలయం నూతన శోభను సంతరించుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



కార్తీక దీపాలతో...

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ప్రాకార మండపంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో నిత్య కైంకర్యాలు గురువారం పాంచారాత్రగమ శాస్త్ర రీతిలో నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణ తంతు కొనసాగింది. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 21,04,961 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవి తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాసన అనంతరం స్వామివారికి మాంగాళ్యధారణ తలంబ్రాలతో కల్యాణం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా పార్వతి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాన్యాసపూర్వక, రుద్రాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి

దేవరకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 20వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహించే ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ వందేళ్ల ఉత్సవాలు కాన్పూరులో గతేడాది డిసెంబరు 26వ తేదీన ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉత్సవాలు నిర్వహించినట్లు వివరించారు. ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు మరింతగా బలపడాలని కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, పల్లా దేవేందర్‌రెడ్డి, మైనొద్దిన్, తూం బుచ్చిరెడ్డి, వెంకటరమణ, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటయ్య, జయరాములు, అంజనేయులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ ఛాన్సలర్‌గా సుబ్బారావు



సుబ్బారావును అభినందిస్తున్న లావు రత్తయ్య

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ యూనివర్సిటీ దేశ్‌ముఖి నూతన ఛాన్సలర్‌గా డాక్టర్ పావులూరి సుబ్బారావు నియమితుల య్యారు. ఆయన చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య నుంచి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ డాక్టర్ పావులూరి సుబ్బారావు ప్రస్తుతం హైదరాబాద్‌లోని అనంత్ బయోటెక్నాలజీస్ లిమిటెడ్ చైర్మన్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పేస్ అకాడమీ అధ్యక్షుడిగా, ఉత్తరప్రదేశ్ ఎకనామికల్ కౌన్సిల్ సభ్యుడు లాంటి కీలక హోదాల్లో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విజ్ఞాన్స్ వర్సిటీ అడ్వైజర్ మాలకొండయ్య, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ దిరిశాల విజయరాము ఉన్నారు.

'పత్తి కొనుగోళ్లకు నిబంధనను తొలగించాలి'

కేతేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విధించిన నిబంధనలను తొలగించాలని రైతు జిల్లా అధ్యక్షుడు వేనేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం నాలుగో మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.

రైతులపై ఏమాత్రం ప్రేమ ఉన్నా ప్రభుత్వం వెంటనే పత్తి కొనుగోలులో విధించిన 7 క్వింటాళ్ల నిబంధనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కిసాన్ కపాస్ యాప్‌తో సంబంధం లేకుండా సీసీఐల్లో పత్తిని కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్ లేని అనేక మంది గ్రామీణ రైతులు కిసాన్ కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోలేక పోతున్నారని అన్నారు. కార్యక్రమంలో మహిళా రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, సీఐటీయూ, రైతు సంఘం నాయకులు ఎల్.రాజు, ఏళ్ల అశోక్‌రెడ్డి, కోట లింగయ్య, సీహెచ్.సత్తయ్య, శ్రీను, కె.బాలయ్య, జి.సత్తిరెడ్డి, కె.శోభన్, నీలం సైదులు, అయ్యన్న, ఎస్.వెంకన్న, పి.మల్లయ్య, జె.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు శంకర్

నల్లగొండరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు కంకణం కట్టుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో సమ్మె చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు, పారా మెడికల్, బీటెక్, పీజీ కళాశాలలపై విజిలెన్స్ దాడులు చేస్తున్నారని విమర్శించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. తక్షణమే వారితో చర్చలు జరిపి నిధులు విడుదల చేసి విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు. లేకుంటే విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని, లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రియాజ్, టిల్లు, శివశంకర్, వరుణ్, సాయి వెంకట్, మహేష్, ఆరీఫ్, పహద్ సందీప్ దీక్షిత్ కోటేష్, వినయ్ పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నకిరేకల్: విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, ప్రణయ్, రహమత్, సాయి, విష్ణు, యశ్వంత్ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' బిల్లులు వెంటనే చెల్లించాలి

నల్లగొండరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతికి కార్మికులతో కలిసి సమస్యలతో కూడిన వినతి ప త్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు, నిర్వహణ బిల్లులు, 10 నెలల కోడిగుడ్ల బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గుడ్లకు ఇచ్చే బడ్జెట్‌కి రెండు గుడ్లు కూడా రావడం లేదని, పైగా మూడు కోడి గుడ్లు పెట్టాలని అధికారులు, స్కూల్ సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పెట్టిన వాటికే పది నెలలుగా బిల్లులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బిల్లులు వేయాలని లేనిచో నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి వెనకాడబోమని అయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నీరుడు రాజ్యలక్ష్మి, అల్లి అనురాధ, నాయకురాళ్లు అండాలు, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నాంపల్లి, నకిరేకల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు కోరారు. గురువారం జిల్లాలోని నాంపల్లి మండలంలోని తుమ్మలపల్లి, నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. నాంపల్లి మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో మలక్‌పేట యశోద ఆసుపత్రి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ క్యాంపులో 275మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మాల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందికట్ల సరస్వతి వెంకటేష్, అకిటి మహేష్, బైకాని వెంకటయ్య, యాదయ్య, చిరంజీవి, నాగరాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్: నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామంలో నకిరేకల్ లయన్స్‌క్లబ్, సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 45 మందికి పరీక్షలు నిర్వహించి 12మందిని కంటి ఆపరేషన్ల కోసం సూర్యాపేట కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, ప్రోగ్రాం ఇన్‌చార్జి యానాల శంకర్‌రెడ్డి, క్లబ్ కార్యదర్శి సూర్యచందర్‌రావు, కోశాధికారి అండెం వెంకన్న, ప్రతినిధులు డి.సూర్యకుమార్, కందాళ వేణుగోపాల్‌రెడ్డి, మీలా సత్యనారాయణ, యానాల శ్రీనివాస్, సూర్యాపేట కంటి ఆసుపత్రి సిబ్బంది స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు భలే భేరం

(5వ పేజీ తరువాయి)

ఆదాయం పెంచే లక్ష్యంతో ఎక్సైజ్‌శాఖ కొన్ని నిబంధనల్లో మార్పులు చేర్పులు చేసింది. గతంలో నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో క్లస్టర్లవారీగా దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తే, తాజాగా జరిగిన టెండర్లలో ఈ క్లస్టర్లను ఎత్తివేశారు. టెండర్ దక్కిన వ్యాపారులు ఆయా మునిసిపాలిటీల పరిధిలో తమకు ఎక్కడ వ్యాపారం సాగుతుందని భావిస్తే అక్కడ దుకాణం ఏర్పాటు చేసుకునే సౌలభ్యం లభించింది. దీంతో మార్కెట్ కేంద్రీకృతం కాకుండా అన్ని దుకాణాలకు సమాన వ్యాపార అవకాశాలుంటాయని, తద్వారా ఆదాయం పెరగుతుందని భావిస్తున్నారు.

అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ గతంలో దుకాణాలను నిర్ణీత గ్రామాల్లోనే ఏర్పాటు చేయాలనే నిబంధన సడలించారు. ప్రస్తుతం మండల కేంద్రంతో పాటు, ఇతర కొన్ని గ్రామాల్లోనూ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు లైసెన్స్‌దారులకు అవకాశం ఇవ్వడంతో వ్యాపారమంతా ఒకేచోట కాకుండా వికేంద్రీకరణ జరిగి, లైసెన్స్ కలిగిన అన్ని దుకాణాలకు వ్యాపారం జరగడంతోపాటు, బెల్ట్ దుకాణాల దందా తగ్గుతుందని, లైసెన్స్‌దుకాణాల వ్యాపారం పెరిగి శాఖకు ఆదాయమూ పెరుగుతుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తూనికలు, కొలతల్లో తేడాలు ఉంటే కఠినచర్యలు

కేతేపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల్లో తేడాలు ఉంటే వ్యాపారులపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి వి.శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం ఆయన కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో పంపులకు స్టాంపింగ్ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం కాంటాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎల్ర్టానిక్, సాధారణ కాంటాల తూకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాల్లో తేడాలు చేసి రైతులను మోసం చేయవద్దని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకుడు బడుగుల నరేందర్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

పుల్లారెడ్డి సంస్మరణ సభలను జయప్రదం చేయాలి

శాలిగౌరారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీరెడ్డి సభ కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. నకిరేకల్ పట్టణంలోని కామ్రేడ్ యానాల మల్లారెడ్డి స్మారక భవనం నవంబరు 8న, నల్లగొండ శ్రామికభవన్‌లో నవంబరు 9వ తేదీన నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఆరబెట్టిన తర్వాతే

(5వ పేజీ తరువాయి)

పడిపోయింది. ఒక్కో ఎకరానికి రైతులు 25వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే ప్రస్తుతం పెట్టుబడి కూడా రావడం కష్టమేనని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సీసీఐ క్వింటాకు రూ.8,110 మద్దతు ఇస్తున్నా, తేమ ఉందని సాకు చూపిస్తూ మద్దతు ధర చెల్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అక్టోబరు ఆఖరికి, నవంబరు మొదటి వారంలో యాసంగి సీజన్ మొదలుకానుంది. అయితే అరకొరగా పండిన ధాన్యం, పత్తి దిగుబడివల్ల పెట్టిన పెట్టుబడులు రాకపోవడం, మద్దతు లభించకపోవడంతో యాసంగిలో పెట్టుబడులు ఎలా అన్న ఆలోచనలు రైతులుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా విడుదల చేస్తేనే యాసంగిలో పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసా చెల్లింపులపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. మొత్తానికి ఈ వానాకాలం రైతులకు నష్టాన్నే మిగిల్చింది. ఎన్నడూ లేని విధంగా అకాల వర్షాలు రైతులను నట్టేటా ముంచాయి.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేది ఎప్పుడో..

ఇటీవల కురిసిన తుఫాన్‌కు జిల్లాలో 65వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా దేవరకొండ డివిజన్‌లో పత్తి, వరి పంట దెబ్బతింది. వ్యవసాయశాఖ అధికారులు తుఫాన్ వచ్చిన మరుసటి రోజే ప్రాథమిక అంచనా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అయితే ఇందులో 33శాతం పంట దెబ్బతింటేనే పరిహారం అందిస్తామని ప్రభుత్వం మెలిక పెట్టింది. దీంతో మళ్లీ సర్వే నిర్వహిస్తారా? లేక ప్రాథమిక అంచనా ప్రకారం పరిహారం చెల్లిస్తారా? అనేది చూడాల్సి ఉంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సైతం పంట నష్టపోయిన రైతులకు ఏ మేరకు పరిహారం ఇస్తారు, ఎకరానికి ఎంత ఇస్తారు?, ఎప్పుడు చెల్లిస్తారు ? అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతులు పంట నష్టపరిహారం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. పంట నష్టపరిహారంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో పంట దెబ్బతిన్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ శాఖ సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి వారం దాటినా, ఇంతవరకు ప్రభుత్వం నుంచి పరిహారంపై స్పష్టత రాకపోవడం గమనార్హం. కనీసం పరిహారం డబ్బులు, రైతు భరోసా నిధులు వస్తే యాసంగి పనులు చేపట్టవచ్చని రైతులు భావిస్తున్నారు.

ఒక విద్యార్థి ఒక మొక్కను సంరక్షించాలి

నార్కట్‌పల్లి: ప్రతీ విద్యార్థి కనీసం ఒక మొక్కనైనా సంరక్షించాలని ఏపీ లింగోటం జడ్పీ హైస్కూల్ మల్లేపల్లి కాశయ్య అన్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు క్లీన్‌హోం-గ్రీన్‌హోం కార్యక్రమ నిర్వాహకుడు ఆదిమళ్ల మణిరాజ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ఆవరణలో మామిడి, కొబ్బరి, పండ్ల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పాలేటి హెప్సిబా, దేవులపల్లి భాస్కర్, సత్యనారాయణ, పద్మావతి, షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లకు నల్లరిబ్బన్ కట్టి బీసీ నేతల నిరసన


మునుగోడు: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకు తమ ఉద్యమం వివిధ రూపాల్లో కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం మునుగోడు మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి అన్నారు. బీసీ జేఏసీ పిలుపు మేరకు గురువారం బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ నేతలు కళ్లకు నల్లరిబ్బన్ కట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు కైలాసంగౌడ్, జిల్లపెల్లి యాదయ్య, నరసింహారావు, కృష్ణయ్య, బొల్ల సత్యం, దాం వెంకన్న, లక్ష్మయ్య, మాలాద్రి, గణేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బస్సు జాతను విజయవంతం చేయాలి

చండూరు: చండూరు పట్టణానికి ఈ నెల 18వ తేదీన రానున్న సీపీఐ బస్సుజాతాను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య కోరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5 | శుక్రవారం 7 నవంబరు 2025

*** గరిష్ఠం 30.0 కనిష్ఠం 22.0


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.90 (311.7462)	49,104	49,104
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	5153.78	3936.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

మద్యం దుకాణాలకు భలే భేరం





● అదిరిపోతున్న గుడ్‌విల్ ఆఫర్లు! ● మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు వ్యాపారుల ప్రయత్నాలు ● షాపులు రానివారి ఆఫర్లతో ఉక్కిరి బిక్కిరవుతున్న కొత్తలైసెన్స్‌దారులు ● రూ.45లక్షల నుంచి రూ.1.20కోట్ల వరకు ఆఫర్

ఒకరిది అదృష్టం.. మరొకరిది ఆశ. వెరసి రూ.3లక్షల విలువైన దుకాణం రూ.కోటిపైనే ధర పలుకుతుండడం ఆశ్చర్యకరం. టెండర్ల ద్వారా దక్కించుకున్న మద్యం దుకాణాలను సొంతం చేసుకునేందుకు కొంత మంది మద్యం వ్యాపారులు గుడ్‌విల్ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. దీంతో కొత్తగా టెండర్ సొంతం చేసుకున్న వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

కొత్తమద్యం దుకాణాలకు డిమాండ్ పెరిగింది. ఈసారి టెండర్లలో పాత వ్యాపారులకు చాలామందికి దుకాణాలు దక్కకపోవడంతో వ్యాపారం వదులుకోలేక, కొత్తగా దుకాణాలు వచ్చినవారికి గుడ్‌విల్ ఆఫర్‌చేస్తూ దుకాణాలు సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. రెండేళ్లపాటు వ్యాపారంతో పాటు, ఈ కాలపరిమితిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయనే సంకేతాలుండడంతో దుకాణాలకు డిమాండ్ భారీగా పెరిగింది. దశాబ్దాలుగా వ్యాపారంలో ఉన్నవారు దుకాణాలు దక్కకపోవడంతో వ్యాపారం కొనసాగించేందుకు గుడ్‌విల్ ఎక్కువైనా ఇచ్చేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రధానంగా జాతరలు జరిగే ప్రాంతాలు, పారిశ్రామిక వాడల సమీపంలోని దుకాణాలు, పెద్ద మండలాల్లోని దుకాణాలకు రూ.కోటికిపైగా గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

రూ.కోటి వరకు గుడ్‌విల్ ఆఫర్

నల్లగొండ జిల్లాలో 154 ఏ-4 మద్యం దుకాణాలుండగా, అందులో గౌడ సామాజిక వర్గానికి 34, ఎస్సీ వర్గానికి 14, ఎస్టీలకు నాలుగు దుకాణాలు కేటాయించగా, మిగిలినవి జనరల్ కేటగిరీలో ఉన్నాయి. ఈ దుకాణాల్లో దాదాపు సగానికి పైగా ఈదఫా కొత్తవారికి వచ్చాయని, గతంలో మద్యం వ్యాపారంలో ఉన్నవారికి, సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేసిన వారికి చాలామందికి ఈసారి లాటరీల్లో నిరాశ ఎదురవడంతో వ్యాపారం వదులుకోలేక వాళ్లు కొత్తగా దుకాణాలు వచ్చినవారికి గుడ్‌విల్ ఇచ్చి దుకాణాలు పొందేందుకు చర్చలు సాగిస్తున్నారు. మునిసిపల్ కేంద్రాల్లో రూ.45 లక్షల నుంచి మొదలవుతున్న గుడ్‌విల్ గ్రామీణ ప్రాంతాలు, జాతరలు జరిగే ప్రాంతాల్లో ఉన్న దుకాణాలకు రూ.1.20 కోట్లవరకు ఆఫర్ ఇస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. తాజాగా తెలిసిన ప్రకారం నిడమనూరు మండలంలోని ఒక డిమాండ్ ఉన్న గ్రామంలోని మద్యం దుకాణానికి రూ.కోటి వరకు గుడ్‌విల్ ఇవ్వాలని టెండరుదారులు కోరుతుంటే, వ్యాపారులు రూ.90లక్షల వరకు చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. మునుగోడు నియోజకవర్గంలోని మండలకేంద్రంలోని ఒక దుకాణానికి ఒక గ్రూపు రూ.90లక్షలు ఆఫర్‌చేయగా, మరో గ్రూపు రూ.కోటి ఇచ్చేందుకు అంగీకరించి వ్యాపారం చేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు.

మార్చుకుంటున్న దుకాణాలు

మరికొన్ని చోట్ల దుకాణాలు వచ్చినవారు మార్చుకుంటున్నారు. ఇప్పటికే వ్యాపారాల్లో ఉన్నవారికి తాము వ్యాపారం చేసే దుకాణాలు కాకుండా వేర్వేరు చోట్ల దుకాణాలు వస్తే, పరస్పరం మార్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. కొత్తగా దుకాణాలు దక్కినవారు గుడ్‌విల్‌కు అంగీకరించకపోతే తమ సిండికేట్లలో భాగస్వాములుగా చేసుకుని, వారికొచ్చిన దుకాణంకంటే ఇంకా అదనంగా ఒకటి, రెండు చోట్ల వ్యాపార నిర్వహణలో వాటాలు ఇస్తామని కూడా ఆఫర్ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

డిసెంబరు వరకు సమయమున్నప్పటికీ..

దుకాణాల ఏర్పాటుకు డిసెంబరు మొదటివారం వరకు సమయమున్నప్పటికీ ఈలోగానే ఎలాగైనా ఒకటో, రెండో దుకాణాలు దక్కించుకోవాలని పాత వ్యాపారులు ప్రయత్నాలు చేస్తున్నారు. గుడ్‌విల్ ఎక్కువగానే ఇస్తుండడంతో లాభాలు తగ్గుతాయని, అంత ప్రయోజనం కూడా ఏమీ ఉండకపోవచ్చని కానీ, వ్యాపారంలో కొనసాగడమే ఏకైక లక్ష్యంగా ఇలా గుడ్‌విల్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లుగా చెబుతున్నారు. బెల్ట్‌షాపులపై నిషేధం అమల్లో ఉన్న మునుగోడు నియోజకవర్గంలోనూ దుకాణాలకు గుడ్‌విల్ భారీగానే ఆఫర్ చేస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బెల్ట్ దుకాణాలపై ఆధారపడడం, జాతరలు, ఎన్నికల వంటి భారీ ఈవెంట్లు కొనసాగితే తప్ప ఇంతభారీ గుడ్‌విల్, ప్రభుత్వానికి చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజులు పోను, లాభాలు దక్కవనే చర్చ సాగుతోంది.

మార్చిన నిబంధనలతో ఆదాయం పెరిగేనా..?

ఎక్సైజ్ సంవత్సరం-2025-27లో వ్యాపారం నిర్వహించేందుకు

..మిగతా 8వ పేజీలో

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

● ఎస్పీ శరత్ చంద్రపవార్



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ రోజు దేశవ్యాప్తంగా అనేక మంది సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసాలకు గురవుతున్నారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎక్కువగా సులభంగా మోసపోయేది సైబర్ నేరగాళ్ల వల్లేనని అన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డబ్బులు పోయాక బాధపడటం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. విద్యార్థులు తెలుసుకొని వారి కుటుంబ సభ్యులు, ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్ర స్తుతం జరుగుతున్న వివరాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లోని వాట్సాప్‌కు ఏపీకే ఫైల్స్ ఫార్వర్డ్ చేస్తున్నారని, ఈ ఫైల్స్ ఓపెన్ చేస్తే వెంటనే ఫోన్ హ్యాక్ చేస్తున్నారు. వెంటనే ఆ నెంబర్‌కు అనుసంధానమైన బ్యాంకులో డబ్బులు పోయే అవకాశం ఉంటుందని అన్నారు. జంప్డ్ డిపాజిట్ స్కీం, డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, సైబర్ బుల్లింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930కి సమాచారం అందించాలని సూచించారు. వెంటనే పోలీసులు స్పందిస్తారని, తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ, ఎస్బీ సీఐ రాము, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ విష్ణు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు పంపించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండరూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేసి ఆ ధాన్యాన్ని తక్షణమే మిల్లర్లకు పంపించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నల్లగొండ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూమెంట్ రిజిస్టర్, ధాన్యం వచ్చిన రిజిస్టర్లను పరిశీలించారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం, తేమ శాతంతో పాటి ఇతర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వర్షాలు తగ్గినందున 17శాతం తేమ వచ్చే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులకు సుచించారు. సరైన తేమశాతం, నాణ్యతా ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, ఈ మేరకు అవసరమైన లారీలు, హమాలీలు, కాంటాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. జిచెన్నారం కేంద్ర వద్ద మాట్లాడుతూ సీరియల్ నెంబర్‌తో సంబంధం లేకుండా సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసి ధాన్యం బస్తాలను వర్షానికి తడవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీల సమస్య, ఇతర ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి పత్యానాయక్, డీఏస్వో వెంకటేష్, పౌరసరఫరాల డీఎం గోపీకృష్ణ, తహసీల్దార్ పరశురాం ఉన్నారు.

మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలి

చిట్యాలరూరల్: కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లుల్లో వెంటనే దిగుమతి చేసుకోవాలని, ఆలస్యం చేయవద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ధాన్యం దిగుమతి తనిఖీల్లో భాగంగా గురువారం చిట్యాల మండలం వట్టిమర్తిలోని ఓ మిల్లును అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో అశోకొరెడ్డిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిగుమతికి సిద్ధంగా ఉన్న ధాన్యం లోడ్ లారీలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం వివరాలు, దిగుమతుల్లో ఇబ్బందుల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోళ్లు జరగక ఎగుమతులు, దిగుమతులు కాలేదని అన్నారు. ప్రస్తుతం వాతావరణం సాధారణంగా మారినందున కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. మిల్లుల్లో ధాన్యం దిగుమతికి ఏర్పాట్లు చేసుకోవాలని, తాత్సారం చేయవద్దని సూచించారు. కలెక్టర్ వెంట పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, డీఎస్‌వో సత్యానాయక్, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.విజయ, ఎంపీడీవో ఎస్వీ జయలక్ష్మి, డీటీ దీపక్, ఆర్ఐలు ఉన్నారు.

ఆరబెట్టిన తర్వాతే..

● వర్షాలు తగ్గడంతో పునఃప్రారంభం ● 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిన ప్రభుత్వ రంగ సంస్థలు



జిల్లాలో ప్రస్తుతానికైతే వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ మొదలైంది. గడిచిన కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలతో పాటు తుఫాన్ ప్రభావం వల్ల కొనుగోలు ఆగిపోయిన విషయం తెలిసిందే. దీంతో తడిసిన ధాన్యంతోపాటు పత్తి తడిసి ముద్దకావడంతో కొనుగోలు చేపట్టలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే అటు పత్తి, ఇటు ధాన్యం ఆరబెట్టిన తర్వాతే విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

వర్షాలు ప్రస్తుతం లేనందున కొనుగోలు చేపట్టడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. అయితే చాలా చోట్ల ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో తడిసిన ధాన్యం రైతులు ఆరబెట్టుకుంటున్నారు. అయితే మళ్లీ అకాల వర్షాలు వస్తే తమ పరిస్థితి ఏమిటన్న భయం రైతులను వెంటాడుతోంది. కొనుగోలు కూడా నత్తనడకన సాగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం అకాల వర్షాలు. జిల్లాలో ఇప్పటి వరకు 85 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ఏడాది వానాకాలానికి సంబంధించిన ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వర్షాలు కురుస్తుండడం, ధాన్యం తడిసిపోవడంతో కొనుగోలు జరగడంలేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు 4,600 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోవడం, అందులో 50 శాతం ధాన్యం తక్కువగా తడవడంతో ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేశాయి. తుఫాన్ ప్రభావంతో 183 ధాన్యం రాశులు తడిసిపోయాయి. ప్రస్తుతం ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో రెండు లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని రాశులు పోసి ఉంచారు. చాలాచోట్ల కుప్పలు తడవడంతో రైతులు ఆరబెట్టుకుంటున్నారు. ఇంకా 5లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేయాల్సి ఉంది.

జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు మొదలు

సీసీఐతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తాము పత్తిని కొనుగోలు చేయకుండా సమ్మె చేపడుతామని జిన్నింగ్ మిల్లుల యజమాన్యాలు హెచ్చరించాయి. అయితే ప్రభుత్వం జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో చర్చలు జరపడంతో గురువారంనుంచి పత్తి కొనుగోలు మొదలయ్యాయి. మొత్తం 13 జిన్నింగ్ మిల్లులలో కొనుగోలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే చాలా చోట్ల జిన్నింగ్ మిల్లులు సమ్మెకు వెళ్తున్నాయని తెలియడంతో రైతులు పెద్దగా రాలేదని సమాచారం. సమ్మె విరమించిన విషయం రైతులకు తెలియకపోవడంతో స్లాట్ బుకింగ్ చేసుకున్నప్పటికీ పత్తిని తీసుకొని రైతులు రాలేదు. దీనికితోడు చాలాచోట్ల పత్తి తడిసిపోవడంతో పత్తి ఆరిన తర్వాతే వెళ్లాలని రైతులు భావిస్తున్నారు. పత్తి 8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని సీసీఐ స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం తేమ శాతాన్ని సడలించకపోవడంతో రైతులు నష్టపోయే అవకాశాలున్నాయి. చాలా చోట్ల పత్తి రంగు మారుతున్నట్లు సమాచారం. వర్షాలతో తడిసిన పత్తి బూజు పట్టడంతోపాటు రంగు మారుతున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు ఆందోళన గురవుతున్నారు. సీసీఐ రోజుకో నిబంధన పెడుతుండటంతో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతోపాటు రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అధికారుల పరిధిలో లేకపోవడంతో సీసీఐ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వానాకాలంలో నిండా మునిగిన రైతులు

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు నిండా మునిగారు. జూన్, జూలైలో వర్షాలు కురవకపోవడంతో పత్తి సాగు ఆలస్యమైంది. ఆగస్టులో కురిసిన వర్షాలతో జిల్లావ్యాప్తంగా 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగయింది. అయితే దిగుబడి మాత్రం గణనీయంగా

..మిగతా 8వ పేజీలో

విద్యార్థుల రక్షణ విషయంలో రాజీపడొద్దు

● బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యురాలు సరిత

● చెర్వుగట్టులో గురుకుల పాఠశాల సందర్శన



చెర్వుగట్టు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సరిత

నార్కట్‌పల్లి, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల రక్షణ విషయంలో రాజీ పడవద్దని బాలల హక్కుల పరిరక్షణ సమితి కమిషన్ సభ్యురాలు సరిత అన్నారు. విద్యార్థులు పాఠశాలలో ఉన్నంత వరకు వారి రక్షణ బాధ్యత పాఠశాల యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో ఉన్న గురుకుల పాఠశాలను డీఈవో బిక్షపతి, మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణిలతో కలిసి ఆమె గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల యొక్క విద్య నైపుణ్యాలను పరిశీలించి ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. గురుకులంలో అందుతున్న వసతుల కల్పనపై విద్యార్థుల ద్వారా ఆరా తీశారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నర్సింహ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక కొరతను అధిగమించేందుకు చర్యలు

● నల్లగొండ మైనింగ్ ఏడీ జాకబ్



ఎస్‌లింగోటం వాగులోని ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఏడీ జాకబ్

కనగల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మైనింగ్ ఏడీ జాకబ్ అన్నారు. గురువారం మండలంలోని బోయినపల్లి, కనగల్, ఎస్‌లింగోటం గ్రామ వాగుల్లోని ఇసుక రీచ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నిలిచాయన్నారు. సాండ్ టాక్సీ కింద బుక్ చేసిన 10 వేల ట్రిప్పుల ఇసుకను వినియోగదారులకు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇసుక రీచ్‌ల్లో వరద ప్రవాహం, మరో పక్క కూలీల కొరత కారణంగా ఇసుక తవ్వకాలు, సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. మరోపక్క దళారులు ఇసుకను బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇసుక సమస్యను అధిగమించేందుకు 15 రోజుల పాటు ఆయా రీచ్‌ల్లో యంత్రాలు (ఎక్స్‌కవేటర్) సాయంతో ఇసుక తవ్వకాలకు తాత్కాలికంగా అనుమతులిచ్చి ఇసుక సరఫరాను వేగవంతం చేసేందుకు కలెక్టర్ పరిశీలిస్తున్నారని అన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద వరద పరిస్థితులను, ట్రాక్టర్ యజమానుల అభిప్రాయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏజీ బాలు, మాజీ సర్పంచ్ పోచమళ్ల లింగయ్యగౌడ్, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

బీసీ బిల్లుకు రాజ్యాంగ సవరణ చేసే వరకూ ఉద్యమం

● బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్



జిల్లా కేంద్రంలో మౌన దీక్షలో పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘం నేతలు

నల్లగొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి రాజ్యాంగ సవరణ చేసే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాసగౌడ్ స్పష్టం చేశారు. బీసీ జేఏసీ పిలుపు మేరకు గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో చేపట్టిన మౌనదీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీసీల వాటా బీసీలకే రాజ్యాంగబద్ధంగా దక్కాలని నాలుగు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో విడుదల చేసిందన్నారు. జీవోను వ్యతిరేకిస్తూ కొందరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కోర్టును వేదికగా చేసుకొని అడుగడుగునా ఆటంకాలు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ పెంచడం ధర్మబద్ధమైనదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అగ్రకులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసినప్పుడు బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఎందుకు ఉండవని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా నవంబరు 6 నుంచి జనవరి చివరి వరకు వివిధ దశల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పోరాటంలో పల్లె నుంచి పట్టణం వరకు బీసీలంతా కదిలి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ నెల 24వ తేదీన ఢిల్లీలో బీసీలకు సామాజిక న్యాయం చేయాలనే ప్రధానమైన డిమాండ్‌తో పార్లమెంట్‌ను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, తండు సైదులు గౌడ్, సుంకరి మల్లేష్‌గౌడ్, పంకజ్‌యాదవ్, పిల్లి రామరాజు, చిలకరాజు చెన్నయ్య, చొల్లేటి ప్రభాకర్, పన్నాల గోపాల్, గోలి సైదులు, బకరం శ్రీను, వైద్యుల సత్యనారాయణ, మిర్యాల యాదగిరి, నేలపట్ల సత్యనారాయణ, మల్లయ్య, శంకర్, కాశయ్య, రాములు, వెంకటేశ్వర్లు, జనార్ధన్, యాదగిరి, బిక్షం, సీతారాములు, దామోదర్, మదు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం

● ప్రాణాలు తీస్తున్న అధ్వాన రోడ్లు

● టార్పాలిన్లు కప్పని టిప్పర్ల యజమానులు

6

మాజీ మంత్రి హరీష్‌రావుకు పరామర్శ



సత్యనారాయణరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీందర్‌కుమార్, కిశోర్‌కుమార్,

దేవరకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు ఇటీవల మృతి చెందారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఆయన దశదినకర్మలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్‌కుమార్, భిక్షమయ్యగౌడ్ పాల్గొని సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హరీష్‌రావును పరామర్శించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఎస్పీ



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో కొబ్బరికాయ కొడుతున్న డీఎస్పీ

మిర్యాలగూడ రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. శ్రీనివాస్‌నగర్‌లోని దామరచర్ల బీసీ గురుకుల పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో మొత్తం 14 పాఠశాలల నుంచి అండర్ 17 విభాగం నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో లక్ష్యం ఏర్పడుతుందని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని, స్నేహ సంబంధాలు మెరుగవుతాయన్నారు. కార్యక్రమంలో బీసీ గురుకుల ఆర్‌సీవో స్వప్న, ప్రిన్సిపాల్స్ ఉమాదేవి, రాజశేఖర్, నవీన్‌కుమార్, పీడీలు శ్రీనివాస్‌రావు, భాస్కర్ ఉన్నారు.

కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని గూడూరు గ్రామస్తులు గురువారం సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు బొంగరాల మట్టయ్య, నూకపంగు కాశయ్య మూగల సైదులు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని రైస్ మిల్లులు, ఇటుక బట్టీల కారణంగా వాతావరణం కలుషితమవుతోందన్నారు. మిల్లర్లు వ్యర్థా లు, బాయిల్డ్ వాటర్‌ను నేరుగా వెలుపలికి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. భూగర్భ జలమంతా కలుషితం అవుతోందన్నారు. నివారణ చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో గ్రామస్తులందరితో కలిసి రాస్తారోకో చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీ టీమ్ ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని నారాయణ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహనసదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన ఉంటే ప్రశ్నించేతత్వం అలవడుతుందన్నారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఆయా అంశాలకు సంబంధించిన సమాచారముంటే వెంటనే కళాశాల యాజమాన్యానికి, పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, ప్రిన్సిపాల్,అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేములపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములపల్లి ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్ నేరాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థులు మొబైల్స్ ద్వారా అనవసరమైన ఆన్‌లైన్ లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. లింక్ ఓపెన్ చేస్తే ఫోన్లు హ్యాక్ గురై అకౌంట్లలో ఉన్న డబ్బులు దోపిడీకి పాల్పడుతారని అన్నారు. ఆన్‌లైన్ లింక్ ద్వారా అకౌంట్ నుంచి డబ్బులను దొంగలించిన వెంటనే అప్రమత్తమై తమకు సమాచారం అందిస్తే వాటిని రికవరీ చేసేందుకు తమవంతుగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలు మద్యానికి బానిసలు కావద్దని, తద్వారా తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు భలే భేరం

(5వ పేజీ తరువాయి)

ఆదాయం పెంచే లక్ష్యంతో ఎక్సైజ్‌శాఖ కొన్ని నిబంధనల్లో మార్పులు చేర్పులు చేసింది. గతంలో నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లో క్లస్టర్లవారీగా దుకాణాలకు టెండర్లు ఆహ్వానిస్తే, తాజాగా జరిగిన టెండర్లలో ఈ క్లస్టర్లను ఎత్తివేశారు. టెండర్ దక్కిన వ్యాపారులు ఆయా మునిసిపాలిటీల పరిధిలో తమకు ఎక్కడ వ్యాపారం సాగుతుందని భావిస్తే అక్కడ దుకాణం ఏర్పాటు చేసుకునే సౌలభ్యం లభించింది. దీంతో మార్కెట్ కేంద్రీకృతం కాకుండా అన్ని దుకాణాలకు సమాన వ్యాపార అవకాశాలుంటాయని, తద్వారా ఆదాయం పెరగుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ గతంలో దుకాణాలను నిర్ణీత గ్రామాల్లోనే ఏర్పాటు చేయాలనే నిబంధన సడలించారు. ప్రస్తుతం మండల కేంద్రంతో పాటు, ఇతర కొన్ని గ్రామాల్లోనూ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు లైసెన్స్‌దారులకు అవకాశమివ్వడంతో వ్యాపారమంతా ఒకేచోట కాకుండా వికేంద్రీకరణ జరిగి, లైసెన్స్ కలిగిన అన్ని దుకాణాలకు వ్యాపారం జరగడంతోపాటు, బెల్ట్ దుకాణాల దందా తగ్గుతుందని, లైసెన్స్‌దుకాణాల వ్యాపారం పెరిగి శాఖకు ఆదాయమూ పెరుగుతుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

డిండి బస్టాండ్‌లో సౌకర్యాలేవీ..?

● దుర్గంధం వెదజల్లుతున్న ఆవరణం ● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి-డిండి)

డిండి మండల కేంద్రంలోని శ్రీశైలం - హైదరాబాద్ జాతీయ రహదారిపై ఉన్న బస్టాండ్ ఏర్పాటు చేసి దశాబ్దాలు గడిచినా నేటికీ సౌకర్యాలు మెరుగుపడలేదు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు, ప్రాంగణం మీదుగా అనేక బస్సులు వచ్చి వెళ్తుంటాయి. ప్రయాణికుల ప్రాంగణంలో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. ఆవరణంతా కంకరతేలి కాలు మోపే వీలులేకుండా ఉంది. బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన బేకరీ, టీస్టాల్, హోటల్‌ల వద్ద పందులు తిరుగుతూ దుర్గంధం వెదజల్లుతున్నాయి. బ స్టాండ్‌లో వేచి ఉండే వారికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ప్రయాణికుల ప్రాంగణంలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. బస్టాండ్ నుంచి వచ్చే వరదనీరు జాతీయ రహదారిపైకి వచ్చి చేరడంతో బురదమయంగా మా రింది. ప్రయాణికుల ప్రాంగణం, పరిసరాలు అపశుభ్రంగా ఉన్నాయి. శ్రీశైలం - హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న డిండి బస్టాండ్‌కు నిత్యం 295 బస్సులు వచ్చి వెళ్తుంటాయి. అచ్చంపేట, దేవరకొండ, కోదాడ, సూర్యాపేట, పికెట్, బీహెచ్ఈఎల్, సంగారెడ్డి, మెదక్, జహీరాబాద్ డిపోలకు చెందిన బస్సులు డిండి బస్టాండ్ మీదుగా వెళ్తుంటాయి. సుమారు 10వేల మంది ప్రయాణికులు ఈ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. బస్సులు, ప్రయాణికుల సంఖ్య పెరిగిందేకాని బస్టాండ్ లో మాత్రం వసతులు మెరుగుపడలేదు.

అంతేకాకుండా ఆవరణలో తీసిన ఇంకుడు గుంతలో నీరు ఇంకకుండా ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. బస్టాండ్ పరిసరాలు, ఇళ్లలో నివాసం ఉండే వారు అంటు వ్యాధుల బారినపడుతున్నారు. ఆర్టీసీ దుకాణ సముదాయం ద్వారా ఆదాయం సమకూరుతున్న సౌకర్యాలు మాత్రం ఎప్పటిలాగానే ఉన్నాయి. చెత్త, చెదారం పేరుకుపోంఖ అధ్వానంగా మారింది. దురువాసన కారణంగా బస్టాండ్‌లో ప్రయాణికులు వేచి ఉండలేకపోతున్నారు.



డిండి ఆర్టీసీ బస్టాండ్

సీసీ నిర్మాణం చేపట్టాలి



బస్టాండ్ ఆవరణలో సీసీ నిర్మాణం చేపట్టాలి. కంకరతేలిన ఆవరణంలో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నీటి గుంతల్లో మురుగునీరు, చెత్తా, చెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తుంది. ప్రయాణికులు వేచి ఉండలేకపోతున్నారు. బస్సులు వెలు పలకు వెళ్లే దారిలో బురదమయంగా మారింది. అధికారులు చర్యలు చేపట్టాలి.

- సింకారు శివాజీ, డిండి

విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి : ఎన్‌వీటీ

దేవరకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు (ఎన్‌వీటీ) అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆవరణంలో గురువారం విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. కరాటే వల్ల శారీరక, మానసిక ప్రయోజనాలు ఉంటాయన్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, ఆత్మ నియంత్రణ, సమస్యలను ఎదుర్కొనే శక్తి వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు ఉచిత కరాటే తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎన్‌వీటీ

సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి : ఎమ్మెల్సీ



జూబ్లీహిల్స్ ప్రచారంలో డప్పు కొడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చి పదికి పైగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తోందన్నారు. మహాలక్ష్మీ, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రైతు బీమా, రుణమాఫీలివ్వడంతో పాటు ఆరోగ్యశ్రీ రూ. 10 లక్షలకు పెంచిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలించిన పదేళ్ల కాలంలో ఏనాడూ రేషన్ కార్డుల ఊసే ఎత్తకపోగా, రేవంత్ సర్కార్ అర్హులందరికీ ఆహార భద్రత కల్పించిందని, సన్న బియ్యం సరఫరా చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని నడిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నికలో లక్ష ఓట్ల మెజార్టీ కచ్చితంగా సాధిస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో నవీన్‌యాదవ్ కుటుంబం చురుగ్గా పాల్గొందని, ఆయన తండ్రి చినశ్రీశైలం కేసీఆర్‌తో కలిసి రాష్ట్రసాధనలో పాల్గొన్నాడని గుర్తు చేశారు. రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ, కుప్పాల సుబ్బారావు, మెరుగు శ్రీను తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ



కళ్లకు నల్ల రిబ్బన్‌కట్టుకొని నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

దేవరకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. బకాయిల విడుదలలో ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో కలిసి కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాల్కర్‌షిప్‌లు వెం టనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకొని స్కాలర్‌షిప్ విడుదల చే యాలని కోరారు. కార్యక్రమంలో బుడిగె వెంకటేష్, నాయకులు వేణుధర్, మనోహర్, మంజుల, యశ్వంత్, సుందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ : విద్యార్థుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమి టీ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, కుర్ర సైదానాయక్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్ కొనసాగుతుండగా, ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. వెంటనే విద్యార్థులు బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరన్న, సిపాయి, బన్నీ, రాకేష్, హనుమాన్, సంజయ్, దేవ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



సభ్యత్వ రసీదు చూపుతున్న విద్యార్థులు

చింతపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల్లో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు. కార్య క్రమంలో సంఘం దేవరకొండ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, సెక్రటరి షేక్. శంశోద్దిన్, మండల అధ్యక్షుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

'సమీప సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయానికి అనుమతించాలి'

డిండి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తాము పండించిన పత్తిని సమీపంలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, వంగూరు, చారకొండ, ఖాజీపూర్ కాటన్ మిల్లుల్లో విక్రయించేందుకు అనుమతించాలని డిండి మండల రైతులు అధికారులను కోరుతున్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న డిండి మండల రైతులు చింతపల్లి, కొండమల్లేపల్లి సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు 40 నుంచి 60 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. దూరం పెరగడం వల్ల రవాణా చా ర్జీలు ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోయారు. అంతేకాకుండా రోజుల తరబడి క్యూలైన్‌లో మిల్లుల వద్ద వేచి ఉండాల్సి వస్తుందని వారు తెలిపారు. డిండి మండలానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న అచ్చంపేట మార్కె ట్ పరిధిలో ఉన్న వంగూరు, చారకొండ, హాజిపూర్ కాటన్ మిల్లుల్లో పత్తి విక్రయించుకునేందుకు కలెక్టర్, డీ ఎంవో అనుమతించాలని వారు కోరారు.

ఈ మేరకు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వీటీ నగర్ నుంచి శబరిమలైకు పాదయాత్ర



వీ.టీనగర్ నుంచి పాదయాత్రతో బయలుదేరుతున్న స్వాములు

చింతపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) మండలంలోని వేంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన అయ్యప్ప మాలధారులు సువర్ణభూమి ఆధ్వర్యంలో గురువారం పాదయాత్రతో శబరిమలై బయలుదేరారు. ముందుగా గొడకొండ్ల రి జర్వాయర్ ఎదురుగా నెలకొన్న అయ్యప్పస్వామి ఆలయంలో గణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అన ంతరం 18 మెట్లపై హారతి వెలిగించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు వైద్యుల ప్రవీణ్‌కుమార్, మల్లోజు జగతయ్య, మట్ట యాదయ్య, జంగయ్య గౌడ్, బండారు శ్రవణ్‌కుమార్, వేణు పాల్గొన్నారు.

వీటీ నగర్ జడ్పీహెచ్ఎస్‌లో ఆకతాయిల హల్‌చల్

చింతపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల వేంకటేశ్వరనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల సామ్రగిని ఆకతాయిల హల్‌చల్ చేశారు. బుధవారం గురునానక్ జయంతి కావడంతో పాఠశాలకు సెలవు ఉంది. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల్లోకి ప్రహరీ దూకి లోనికి ప్రవేశించారు తాళాలు లేని తరగతి గదుల్లో మద్యం తాగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తరగతి గదుల్లో విద్యుత్ సరఫరా బోర్డు, ఫ్యాన్లు, కొన్ని బెంచీలను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం హెచ్ఎం కృష్ణవేణి, అధ్యాపకులతో కలిసి ధ్వంసం చేసిన తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల రాజేష్ సాగర్, లక్ష్మణ్ సాగర్, రాంమోహన్, జంగయ్య పల్లపు శ్రీనివాస్, బాల్‌రాజ్, కరుణాకర్, ప్రవీణ్‌కుమార్, శ్రీరాములు పాల్గొన్నారు.

విషాహారం తిని 120 గొర్రెలు మృతి



రోదిస్తున్న గొర్రెల కాపరులు

వేములపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో గురువారం విషాహారం తిని 120గొర్రెలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అన్నారం గ్రామానికి చెందిన శ్రీరాముల కోట య్య, శ్రీరాముల గోపాల్, దోసపహాడ్ గ్రామానికి చెందిన కడమంచి రాములు, ఉప్పనూతల సైదులు, సింగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బయ్య వీరయ్య, వేములపల్లి మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఆవుల కోటయ్య తమ గొర్రెల మేత కోసం వేములపల్లి మండల కేంద్రం సమీపంలోని పొలాలకు కొన్ని రోజుల క్రితం తోలుకువచ్చారు. కాగా వరికొయ్యల్లో విషాహారం తినడంతో బుధవారం రాత్రి సుమారు 80 గొర్రెలు, గురువారం ఉదయం మరో 40గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. దీంతో సుమారు రూ.20లక్షల మేర నష్టం వాటిల్లింది. దీంతో గొర్రెలే జీవనాధారంగా బతుకుతున్న తమకు తీవ్రంగా నష్టం జరిగిందని ప్రభుత్వపరంగా సాయం చేసి ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.



నీరసించిన గొర్రెల నుంచి నమూనాలు సేకరిస్తున్న పశువైద్య సిబ్బంది

రక్తనమూనాల సేకరణ

గొర్రెల కళేబరాలకు నల్లగొండ జిల్లా పశువైద్యాధికారి జీవీ.రమేష్ తమ బృందంతో కలిసి పోస్టుమార్టం నిర్వహించారు. నీరసంగా ఉన్న పలు గొర్రెల నుంచి రక్త నమూనాలను సేకరించి వైద్యం అందిస్తున్నారు. విషాహారం తిని ఉండవచ్చని ప్రాథమిక అంచనా వేసినట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి సమాచారం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీ జూలకంటి వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్, పశువైద్యాధికారులు అశోక్, జ్ఞానేశ్వర్ ప్రసాద్, గోపాలమిత్రలు యాదగిరి, వెంకన్న, దుర్గమ్మ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన తర్వాతే

(5వ పేజీ తరువాయి)

పడిపోయింది. ఒక్కో ఎకరానికి రైతులు 25వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే ప్రస్తుతం పెట్టుబడి కూడా రావడం కష్టమేనని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సీసీఐ క్వింటాకు రూ.8,110 మద్దతు ఇస్తున్నా, తేమ ఉందని సాకు చూపిస్తూ మద్దతు దర చెల్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అక్టోబ రు ఆఖరికి, నవంబరు మొదటి వారంలో యాసంగి సీజన్ మొదలుకానుంది. అయితే అరకొరగా పండిన ధాన్యం, పత్తి దిగుబడివల్ల పెట్టిన పెట్టుబడులు రాకపోవడం, మ ద్దతు లభించకపోవడంతో యాసంగిలో పెట్టుబడులు ఎలా అన్న ఆలోచనలు రైతులుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా విడుదల చేస్తేనే యాసంగిలో పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు రైతు భరోసా చెల్లింపులపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. మొత్తానికి ఈ వానాకాలం రైతులకు నష్టాన్నే మిగిల్చింది. ఎన్నడూ లేనివిధంగా అకాల వర్షాలు రైతులను నట్టేటా ముంచాయి.

నష్టపోయిన రైతులను ఆదుకునేది ఎప్పుడో..

ఇటీవల కురిసిన తుఫాన్‌కు జిల్లాలో 65వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా దేవరకొండ డివిజన్‌లో పత్తి, వరి పంట దెబ్బతింది. వ్యవసాయశాఖ అధికారులు తుఫాన్ వచ్చిన మరుసటి రోజే ప్రాథమిక అంచనా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అయితే ఇందులో 33శాతం పంట దెబ్బతింటేనే పరిహారం అందిస్తామని ప్రభుత్వం మెలిక పెట్టింది. దీంతో మళ్లీ సర్వే నిర్వహిస్తారా? లేక ప్రాథమిక అంచనా ప్రకారం పరిహారం చెల్లిస్తారా? అనేది చూడాల్సి ఉంది.

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సైతం పంట నష్టపోయిన రైతులకు ఏ మేరకు పరిహారం ఇస్తారు, ఎకరానికి ఎంత ఇస్తారు?, ఎప్పుడు చెల్లిస్తారు ? అనేదానిపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతులు పంట నష్టపరిహారం కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. పంట నష్టపరిహారంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో పంట దెబ్బతిన్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ శాఖ సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి వారం దాటినా, ఇంతవరకు ప్రభుత్వం నుంచి పరిహారంపై స్పష్టత రాకపోవడం గమనార్హం. కనీసం పరిహారం డబ్బులు, రైతు భరోసా నిధులు వస్తే యాసంగి పనులు చేపట్టవచ్చని రైతులు భావిస్తున్నారు.